## వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎస్పీ



మెదక్ అర్బన్, జూన్18: విద్యాసంస్థకు 100 మీటర్స్ పరిధిలో ఉన్న దుకాణాల్లో ఎలాంటి పొగాకు ఉత్పత్తులు, మత్తు పదార్థాలను అమ్మకూడదని ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం జిల్లా ప్రధాన కార్యాలయంలో టీఎస్ఎన్‌బీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టొబాకో ఫ్రీ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ వాల్ పోస్టర్‌ను ఎస్పీ ఆవిష్కరించారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 18: మాదకద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యత్తుతో పాటు ఆరోగ్యాన్ని నాశనం చేసుకోవద్దని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ అధ్యక్షతన డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ డ్రగ్స్ బారిన పడితే జీవితాలు సర్వనాశనాలు అవుతాయన్నారు. సంఘ వ్యతిరేకశక్తులు మాదకద్రవ్యాలు విక్రయిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది రాజేశ్, రాంచందర్, అధ్యాపకులు ప్రవీణ్‌కుమార్, శరత్‌రెడ్డి పాల్గొన్నారు.

## లంపీస్కిన్ జబ్బు రాకుండా చర్యలు



రామాయంపేట, జూన్ 18: పశువులకు లంపీస్కిన్ బజ్జు రాకుండా ముందస్తుగా టీకాలు వేస్తున్నట్లు డీ.ధర్మారం పశు వైద్యుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని డి.ధర్మారం, లక్మాపూర్ గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఆవులు, బర్లు, దూడలకు ముద్ద చర్మ వ్యాధి రాకుండా చికిత్సలు నిర్వహించి టీకాలును వేయించారు.

## ఎస్సీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నర్సాపూర్, జూన్18: ఎస్సీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని హోలియ దాసరి హక్కుల పోరాట సమితి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక కార్పొరేషన్‌తో పాటు చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు అమలు చేయాలని, జస్టిస్ పున్నయ్య కమిషన్ అమలుపరిచి భూమిలేని 59 దళిత కులాలకు భూ పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. హోలియదాసరి కులం విద్యార్థులకు అన్ని ప్రభుత్వ, గురుకుల పాఠశాలల్లో చదువుకునేందుకు ఎలాంటి ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ లేకుండా నేరుగా సీట్లు కేటాయించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

## 272 గ్రాముల ఎండు గంజాయి పట్టివేత



ఎండు గంజాయితో రాజ్‌దేవ్‌సింగ్

రామాయంపేట, జూన్ 18: ఎండు గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్లు రామాయంపేట ఎక్సైజ్ సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం రామాయంపేట సర్కిల్‌లో చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్‌లోని స్టీల్ పరిశ్రమ వద్ద ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉన్న బీహార్ రాష్ట్రానికి చెందిన రాజ్‌దేవ్ సింగ్ వద్ద నుంచి 272 గ్రాముల ఎండు గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్సైలు విజయసారధి, హరీశ్ తెలిపారు.

## పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ



మెదక్ మున్సిపాలిటీ, జూన్ 18: గ్రోస్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి జాయ్‌మ్రే కుమారుడు చెర్రి థామస్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం 32 నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెర్రీ, ఫెర్రీ పాల్గొన్నారు.

## అత్తారింటికి వెళ్తూ అనంతలోకాలకు..



దేవుని రాజేందర్ (ఫైల్)

రామాయంపేట, జూన్ 18: అత్తారింటికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుతారిపల్లి శివారులో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని 9వ వార్డుకు చెందిన దేవుని రాజేందర్(27) మండలంలోని సుతారిపల్లిలోని అత్తారింటికి అర్ధరాత్రి బైక్‌పై బయలుదేరాడు. మార్గ మధ్యలో రోడ్డుకు అడ్డంగా అడవి పందులు రావడంతో వాటిని తప్పించబోయి కిందకు వెళ్లి చెట్టుకు ఢీకొట్టాడు. దీంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సుతారిపల్లి గ్రామస్తులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. అప్పటికే రాజేందర్ తలకు బలమైన గా యాలు కావడంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై బాలరాజు ఘటనా స్థలికి వెళ్లి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి శూన్యం

కౌడిపల్లి, జూన్18: కాంగ్రెస్ పాలనలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సార రామాగౌడ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు స్వచ్ఛత వైపు పయనించాయని, ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించాయన్నారు. నేడు ప్రత్యేకాధికారుల పాలనలో నిధుల్లేక ట్రాక్టర్లు మూలకుపడ్డాయన్నారు. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం లోపించిందన్నారు.

# రూ.6517.51 కోట్లతో జిల్లా వార్షిక రుణ ప్రణాళిక

- లక్ష్యాలు సాధించడానికి చిత్తశుద్ధితో పనిచేయాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్



మెదక్ నర్సింగ్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



మెదక్ కలెక్టరేట్‌లో జిల్లా వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

మెదక్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): ప్రాధాన్యతా రంగానికి బ్యాంకులు వచ్చే సంవత్సరం పూర్తి లక్ష్యాలు సాధించడానికి చిత్తశుద్ధితో పని చేయాల్సిన అవసరం ఉన్నదని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. వచ్చే వార్షిక సంవత్సరానికి రూ.6517.51 కోట్లతో జిల్లా వార్షిక రుణప్రణాళికను నిర్ణయిస్తూ జిల్లా వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ ఆవిష్కరించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ హాలులో అధికారులు, బ్యాంకు మేనేజర్లు, వివిధ బ్యాంకు కంట్రోలర్‌తో బ్యాంకుల రుణ వితరణ, బ్యాంకు లింకేజీకి ఉన్న ప్రభుత్వ పథకాలపై డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాస పథకం జిల్లాలో స్వయం ఉపాధి, రంగాల్లో లక్ష్యాలు నిర్దేశించుకుని రుణాలు అందించాలన్నారు. వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ రైతాంగానికి లోన్స్ మంజూరు చేయాలన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా మహిళా స్వ యం సహాయక సంఘాలకు అధిక మొత్తంలో రుణాలు అం దించి తోడ్పాటున అందించాలన్నారు. జిల్లా వార్షిక రుణ ప్రణాళిక 2024-25 ప్రకారం వివిధ రంగాల్లో రూ.5857 కోట్లు రుణాల లక్ష్యం ఉండగా, రూ. 4366.84 కోట్లు (74.55%) రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. ఇందులో వ్యవసాయేతర రుణాల లక్ష్యం రూ.3647.75 కోట్లు ఉండగా, జిల్లాలో రూ.2857.75 కోట్లు (78.34%) మంజూరు చేశామన్నారు. పంట రుణాల లక్ష్యం రూ.2267.25 కోట్లు ఉండ గా, జిల్లాలో రూ.1603.80 కోట్లు (70.74%) మంజూరు చేశామని చెప్పారు. ప్రణాళిక ప్రకారం రుణాలు మంజూరు చేయడంలో చొరవ చూపుతున్న బ్యాంకర్లను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో 2025-26 వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. మొత్తం జిల్లా వార్షిక రుణ ప్రణాళిక 2025-26కు రూ.6517.51 కోట్లు కేటాయించగా, పంట రుణాలు రూ.1977.46 కోట్లు, వ్యవసాయ రుణాలు రూ.3971.05 కోట్లు, ప్రాధాన్యత రంగానికి రూ.5481.60 కోట్లుగా కేటాయించారు. అదనపు కలెక్టర్ నగేశ్, డీఆర్డీవో శ్రీనివాస్, ఎల్‌డీఎం నరసింహమూర్తి, డీడీఎం నాబార్డు కృష్ణ తేజ, ఎల్డీవో ఆర్బీఐ శ్రావ్య, వాణిజ్య, సహకార, ఆర్ఆర్‌బీ బ్యాంకుల కంట్రోలర్స్, మేనేజర్లు, డిస్ట్రిక్ట్ డిపార్ట్మెంట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

### నర్సింగ్ కళాశాలను సందర్శించిన కలెక్టర్

జిల్లా కేంద్రంలో నర్సింగ్ కళాశాలను కలెక్టర్ రాహుల్‌రాజ్ తనిఖీ చేశారు. కళాశాల విద్యార్థులకు అందుతున్న బోధన, ఇతర సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. నర్సింగ్ కళాశాల విద్యార్థులకు మెరుగైన బోధన, సౌకర్యాలను అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. జిల్లాకు నూతన నర్సింగ్ కాలేజ్ భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు.

# భూభారతి దరఖాస్తుల కోసం పడిగాపులు



వెల్దుర్తి తహసీల్ కార్యాలయంలో భూ సమస్యల దరఖాస్తుల కోసం వచ్చిన రైతులు



టేక్మాల్: తంపులూర్ గ్రామంలో రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న రెవెన్యూ అధికారులు



రామాయంపేటలోని కాట్రియాల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఎస్సై, తహసీల్దార్

వెల్దుర్తి, జూన్ 18: భూ సమస్యల పరిష్కారం కోసం భూభారతి దరఖాస్తులు తీసుకోవడానికి రైతులు పడిగాపులు పడుతున్నారు. గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు రాలేని రైతులు తహసిల్ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వడానికి వచ్చి బుధవారం గంటల కొద్దీ వేచి చూడాల్సి వస్తున్నది. రెవెన్యూ సదస్సుల సమాచారం సరిగ్గా లేక, పలు ఇబ్బందులతో రాలేని రైతులు తహసిల్ కార్యాలయానికి వచ్చి దరఖాస్తులు అందజేస్తున్నారు.

### భూ సమస్యలపై నిర్లక్ష్యం చేయవద్దు

రామాయంపేట, జూన్ 18: భూమి సమస్యలపై ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని భూ భారతిలో తమ దరఖాస్తును అందించి, సమస్యను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ రజినీకుమారి, ఎస్సై బాలరాజు పేర్కొన్నారు. కాట్రియాల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, ఏఈవోలు, ఆర్ఐ.గౌస్ తదితరులు ఉన్నారు.

### టేక్మాల్‌లో కొనసాగుతున్న సదస్సులు

టేక్మాల్, జూన్ 18: భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు టేక్మాల్ మండలంలో కొనసాగుతున్నాయి. మండలంలోని తంపులూర్ గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. తమ భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రైతులు అధికారులకు దరఖాస్తులను సమర్పించారు. క్షేత్రస్థాయిలో విచారణ చేసి అర్హులైన రైతుల సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ తులసీరాం తెలిపారు. సదస్సులో ఆర్ఐ సాయిశ్రీకాంత్, సిబ్బంది, రైతులు ఉన్నారు.

### ఎక్కువ శాతం సాదాబైనామాలే..

చేగుంట, జూన్18: గ్రామాల్లో ఎక్కువ శాతం సాదాబైనామలకు సంబంధించిన దరఖాస్తులు వస్తున్నాయని చేగుంట తహసీల్దార్ శ్రీకాంత్ పేర్కొన్నారు. మండలంలోని చిన్నశివునూర్, కర్నాల్‌పల్లి గ్రామాలకు సంబంధించి చిన్నశివునూర్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద భూభారతి రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ స్వప్న, ఆర్ఐలు జైభారత్‌రెడ్డి, సంతోష్‌రావు, సర్వేయర్ రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కొటారి అశోక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



డీ.ధర్మారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ర్యాలీ

రామాయంపేట, జూన్ 18: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. బుధవారం మండలంలోని డీ.ధర్మారంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, టీచర్లు కలిసి గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ బడిబయట పిల్లలకు అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీలోని చిన్నారులకు టీచర్లు అక్షరభ్యాసం చేయించి చిన్నారుల ఎత్తు, బరువు వారి ఆరోగ్యాన్ని పరిశీలించారు.

## ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ ఆదేశాలను పాటించాలి



ఎంఈవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు

తూప్రాన్, జూన్ 18: ప్రభుత్వ ఆదేశాలకు లోబడి ప్రైవేటు పాఠశాలలు పనిచేయాలని, అందుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని తూప్రాన్ ఎంఈవో పార్వతి సత్యనారాయణ అన్నారు. మండల వనరుల కేంద్రంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లతో బుధవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రైవేటు పాఠశాలలు ఇష్టానుసారంగా వ్యవహరించకూడదని, విద్యార్థుల పట్ల కఠినంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. డబుల్ ప్రమోషన్ సరికాదని, పాఠశాలల్లో అధిక ధరలకు పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉన్నదని, పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు విక్రయించడం చట్టరీత్యానేరమన్నారు. సమావేశంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, మండల వనరుల కేంద్రం సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

# టెలిగ్రామ్ లింకుతో రూ.2.26లక్షలు ఖాళీ

### సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్సై

శివ్వంపేట, జూన్ 18: అధిక డబ్బులు వస్తాయన్న ఆశతో ఓ వ్యక్తి టెలిగ్రామ్‌తో వచ్చిన లింకును ఓపెన్ చేయడంతో ఏకంగా రూ.2లక్షల 26వేలు పోగొట్టుకున్న ఘటన శివ్వంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏదుల్లాపూర్‌కు చెందిన మేకల చంద్రశేఖర్‌రెడ్డికి టెలిగ్రామ్‌లో ఒక లింకు వచ్చింది. దానిలో రూ.500 పంపిస్తే డబుల్ వస్తాయని నమ్మి, అతడు కొద్దికొద్దిగా డబ్బులు పెట్టాడు. తొలుత డబ్బులు వచ్చినప్పటికీ తరువాత రాలేదు. ఆ విధంగా మొత్తం రూ.2లక్షల 26వేలు పోగొట్టుకున్నాడు. మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేయగా రూ.18 వేల నగదు హోల్డ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మొబైల్‌కు లింకు పంపినప్పుడు వాటిని ఓపెన్ చేయవద్దన్నారు. ఓటీపీలు, పిన్ నంబర్లు చెప్పవద్దని ఎస్సై తెలిపారు.

### సైబర్ నేరాలపై అవగాహన

నిజాంపేట, జూన్ 18: నిజాంపేట ఎస్సై రాజేశ్ ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బంది చార్‌భాయ్ బీడీ కంపెనీలో పనిచేస్తున్న బీడీ ప్యాకర్స్‌కు సైబర్ నేరాలపై బుధవారం అవగాహన కల్పించారు. తెలియని నెంబర్ నుంచి ప్రభుత్వ అధికారులమంటూ, బ్యాంకు వాళ్లమంటూ ఫోన్‌కు వచ్చే ఓటీపీని ఎవరికీ చెప్పకూడదన్నారు. ఫోన్‌కు వచ్చే APK ఫైల్స్ ఓపెన్ చేయవద్దని సూచించారు.

### అల్లాదుర్గంలో..

అల్లాదుర్గం, జూన్ 18: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శంకర్ సూచించారు. అల్లాదుర్గం చౌరస్తా వద్ద సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బల్‌రాం, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రమాదంలో గొర్రెలకాపరి మృతి



మల్లేశం(ఫైల్)

రామాయంపేట, జూన్ 18: విద్యుత్ ప్రమాదంలో తీవ్రగాయాలై, చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించడంతో గొర్రెలకాపరి మృతి చెందిన ఘటన రామాయంపేటలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన గాయంతి మల్లేశం(44) వారం రోజుల క్రితం గొర్రెలకు మేత కోసం చెట్టెక్కి కొమ్మలు కొస్తున్నాడు. పైన ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని కార్పొరేట్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందాడు. విద్యుత్ షాక్‌తో మల్లేశం మృతి చెందాడని, తమకు పరిహారం ఇవ్వాలని కుటుంబీకులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఏడీఈ ఆదయ్య అక్కడకు చేరుకుని విద్యుత్ శాఖ నుంచి నష్ట పరిహారం ఇప్పిస్తానన్నారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎస్సై బాలరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రైతు భరోసా దరఖాస్తుల గడువు పెంపు

అల్లాదుర్గం, జూన్ 18: ప్రభుత్వం రైతు భరోసా దరఖాస్తు స్వీకరణ గడువును నెల 20వ తేదీ వరకు పెంచినట్లు మండల వ్యవసాయ అధికారి రాజేశ్ ప్రకటనలో తెలిపారు. రైతుల కోసం వానకాలం పంటకు రైతు భరోసా కింద పెట్టుబడి సాయం ఇస్తున్నదన్నారు. అర్హులైన రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా బుక్ జిరాక్స్‌లతో, దరఖాస్తు ఫారం పూర్తి చేసి ఇవ్వాలన్నారు. మండలంలో 366 మంది కొత్తగా పట్టాపాస్ పుస్తకాలు జారీ చేయబడ్డాయని, ఇందులో 166 మంది దరఖాస్తు చేసుకున్నారని, మిగతా వారు కూడా గడువులోగా రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### రామాయంపేటలో..

రామాయంపేట, జూన్ 18: రైతు భరోసాను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిందని వ్యవసాయశాఖ ఇన్‌చార్జి ఏడీఏ రాజ్‌నారాయణ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ డివిజన్‌లోని రామాయంపేట, నిజాంపేట, చేగుంట, నార్సింగి మండలాల్లో మూడెకరాల్లోపు ఉన్న 36,500 మంది రైతులకు రూ.23.14కోట్లను ఒకేసారి జమ చేసినట్లు తెలిపారు.

## నిబంధనల మేరకు ఇండ్లు నిర్మించాలి: డీపీవో



ఇందిరమ్మ ఇండ్లనిర్మాణం కోసం పోసిన ముగ్గును పరిశీలిస్తున్న డీపీవో యాదయ్య

చేగుంట, జూన్18: ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టాలని డీపీవో యాదయ్య తెలిపారు. చేగుంటలో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల కోసం పోసిన ముగ్గును, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో చెత్తాచెదారం లేకుండ శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎంపీవో ప్రశాంత్, ఈవో నరేశ్, టైలర్ శ్రీను, నవీన్, లక్ష్మి తదితరులున్నారు.

## రైతు భరోసాకు దరఖాస్తులు ఆహ్వానం



కౌడిపల్లి, జూన్18: రైతుభరోసాకు రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మండల వ్యవసాయ అధికారి స్వప్నాజాదవ్ అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ వ్యవసాయానికి పెట్టుబడి సహాయం రైతు భరోసా పథకం ద్వారా పొందడానికి ఈనెల 5వ తేదీవరకు కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకం పొందిన రైతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఇందుకు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా బుక్కు జిరాక్స్‌లను దరకాస్తు ఫారానికి జతచేసి వ్యవసాయ కార్యాలయంలో ఈ నెల 20వ తేదీ వరకు అందజేయాలని సూచించారు. గతంలో రైతు బంధు పొందిన రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు.



లీకేజీతో వృథాగా పోతున్న నీరు

### వృథాగా మిషన్ భగీరథ నీరు

అల్లాదుర్గం, జూన్ 18: మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కావడంతో తాగు నీరు వృథాగా పోతున్నది. మండలంలోని గడిపెద్దాపూర్ శివారులో ఉన్న 161వ జాతీయ రహదారి పక్కన మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అయ్యింది. దీంతో తాగు నీరు వృథాగా పోతున్నది. ఈ నీరు జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డుపై పడుతుండడంతో రోడ్డుపై వెళ్తున్న వాహదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


### దుర్గామాత ఆలయానికి డోలు వితరణ



బాలకిషన్‌ను సత్కరిస్తున్న పూజారి

పాపన్నపేట, జూన్ 18: ఏడుపాయల వనదుర్గా భవానీ మాత ఆలయానికి పాపన్నపేటకు చెందిన విలేకరి వంజరి బాలకిషన్ బుధవారం డోలు వితరణ చేశారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు సత్కరించి అమ్మవారి ప్రసాదం అందజేశారు.

### ఏడుపాయల్లో ఎమ్మెల్సీ పూజలు



పాపన్నపేట, జూన్ 18: ఎమ్మెల్సీ అంజిరెడ్డి తన పుట్టిన రోజు సందర్భంగా ఏడుపాయల వనదుర్గామాతను బుధవారం దర్శించుకున్నారు. అనంతరం దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట నాయకులు మల్లేశ్‌గౌడ్, ముదిరాజ్ సంఘం నాయకుడు బైండ్ల సత్యనారాయణ, గడ్డం శ్రీనివాస్, సంతోష్ చారి, కొండ రాములు, సుంకరి సాయిలు తదితరులు ఉన్నారు.

### క్రీడా పాఠశాలకు ఇద్దరు ఎంపిక

నర్సాపూర్, జూన్18: క్రీడా పాఠశాలకు ఇద్దరు విద్యార్థులను నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎంపిక చేసినట్లు ఎంఈవో తారాసింగ్ బుధవారం తెలిపారు. నర్సాపూర్‌లోని విష్ణు ప్రైవేట్ పాఠశాలకు చెందిన హాసిని, ఖాజీపేట్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన నందిక ఎంపికయ్యారు. పీజీహెచ్ఎం చంద్రశేఖర్, పీడీ ఆంజనేయులు ఉన్నారు.

### గురుకులంలో ఆయుర్వేద వైద్య శిబిరం

రామాయంపేట, జూన్ 18: విద్యార్థి దశ నుంచే యోగాపై పట్టు సాధించాలని ఆయుర్వేద వైద్యులు రాణి శర్మ, భవానీ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని గురుకుల విద్యాలయంలో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం ఆయూష్ యోగా అధ్వర్యంలో మాస్టర్ భరత్ విద్యార్థులతో యోగా ఆసనాలు, ధ్యానం, ప్రాణాయామం చేయించారు. కార్యక్రమంలో ఫార్మాసిస్టు శ్రీనివాస్, రేఖ ఉన్నారు.

### వ్యక్తికి మూడేండ్ల జైలుశిక్ష

మెదక్ అర్బన్, జూన్ 18: బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి మూడు సంవత్సరాలు జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానాను జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ విధించినట్లు ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు తెలిపారు. కోనేటి రాజు 2019లో ఆరేండ్ల బాలిక, తన సోదరుడితో ఆడుకుంటుండగా పల్లీలు ఇప్పిస్తానని చెప్పి ఇంట్లోకి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆ వ్యక్తిపై విచారణ జరిపి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి డీఎస్పీ కిరణ్‌కుమార్ కేసు నమోదు చేశారు. దీంతో కోర్టులో హాజరుపరచగా ప్రస్తుత ఎండీ అహ్మద్ మోహిద్దీన్ సాక్షులను ప్రవేశపెట్టి, కేసును నిరూపించారు. దీంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిందితుడికి మూడేండ్ల జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించినట్లు తెలిపారు.

### లయన్స్‌క్లబ్ చైర్మన్‌గా దేమె యాదగిరి

రామాయంపేట, జూన్ 18: సేవా కార్యక్రమాలతోనే లయన్స్ క్లబ్‌కు గుర్తింపు ఉంటుందని పాస్ట్ డిస్ట్రిక్టు గవర్నర్ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఓ రిసార్ట్‌లో లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గానికి ప్రమాణ స్వీకారం చేయించారు. మూడోసారి లయన్స్‌క్లబ్ రామాయంపేట చైర్మన్‌గా ఎన్నికైన దేమె యాదగిరి, కార్యదర్శి జీడి తిరుపతిగౌడ్‌తో ప్రమాణం చేయించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో అవయవదానం, ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందిజేయాలన్నారు. కార్యక్రమంలో టీవీపీ చారి, నర్సింహ్మారావు, సంజయ్ తదితరులు ఉన్నారు.